
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
7 జిల్లా వార్తలు
ఆదివారం 20 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత: గరిష్ఠం 40.5 కనిష్ఠం 20.8



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

పెన్సిల్ మొనలపై కళాఖండాలు



- ధర్మకోల్‌తో సినిమా సెట్టింగులు
- చాక్‌పీస్‌లతో ప్రముఖుల చిత్రాల రూపకల్పన
- మైక్రో ఆర్టిస్టుగా రాణిస్తున్న కరుణాచారి
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- ఆదరణ లేక పల్లెటూరికే పరిమితం

9



Sunday Special

ప్రతిభకు అవధులు లేవని ఈ కళాకారుడి నేర్పును చూస్తే స్పష్టమవుతుంది. చాక్‌పీస్‌పై అద్భుతమైన కళాఖండాలు చెక్కడం, పెన్సిల్ మొనపై ప్రముఖుల నగిషీలు తీర్చిదిద్దడం.. థర్మకోల్‌తో బాహుబలి సినిమా సెట్టింగుల వంటివి చేయడంలో అతడికి అతనే సాటి. మైక్రో ఆర్టిస్టుగా నైపుణ్యాన్ని చాటుతున్న కరుణాచారిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

మంచాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి)

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

ఉమ్మడి జిల్లాలో ప్రణవ్‌కు 103, జస్వంత్‌రెడ్డికి 23,577 ర్యాంకు

9



ఉమ్మడి జిల్లాలో గడువు తీరిన వాహనాలు ఇబ్బడిముబ్బడిగా తిరుగుతూ కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. నిబంధనల ప్రకారం 15ఏళ్లకు పైబడిన వాహనాలను రోడ్డు మీద తిరగనీయొద్దు. ఈ వాహనాల నుంచి వెలువడే పొగ కారణంగా వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. పాత వాహనాల నుంచి వెలువడుతున్న పొగలో కర్బన ఉద్గారాలు అధికంగా ఉండడం వల్ల శ్వాసకోశ వ్యాధులు, ఇతర ప్రాణాంతక ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. అంతేకాకుండా కాలం చెల్లిన వాహనాలు ప్రమాదాలకూ కారణమవుతున్నాయి. వీటిని తుక్కుగా మార్చాలని, రోడ్డు మీద తిరగనీయమని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు.



కాలం చెల్లిన వాహనాలతో

కాలుష్యం!



ఉమ్మడి జిల్లాలో 10లక్షలకుపైగా పాత వాహనాలు

- శివార్లలో కాలుష్యం పెరగడానికి దోహదం
- గడువు తీరిన వాహనాల లెక్కలు తేల్చిన ప్రభుత్వం
- కాలుష్య నియంత్రణకు పకడ్బందీ చర్యలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : పలు నగరాల్లో కాలుష్యం పెరగడంపై కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి గడ్కరీ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. వాహనాల కాలుష్యం కారణంగానే నగరాల్లో జీవించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గడువుతీరిన వాహనాలపై మళ్లీ చర్చమొదలైంది. పాత వాహనాలను తుక్కుగా మార్చాలని గతంలోనే ప్రభుత్వాలు నిర్ణయించినప్పటికీ ఆచరణలో మాత్రం జరగడం లేదు. అదనంగా పన్నులు కట్టించుకుని ఈ వాహనాలకు మరికొంత కాలం గడువు పొడిగిస్తున్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి గడువుతీరిన వాహనాలను తుక్కుగా మారుస్తామని, డీజిల్ వాహనాలను ఔటర్ లోపల

మిగతా 9వ పేజీలో...



15ఏళ్లకు పైడిన వాహనాలు	
రంగారెడ్డి	4.9లక్షలు
మేడ్చల్	4.7లక్షలు
వికారాబాద్	0.60లక్షలు

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

కడ్తాల్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణ ప్రతీ పౌరుడి బాధ్యత అని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. ఉన్నత విద్యలో పర్యావరణ పరిరక్షణ సిలబస్ ప్రవేశ పెడుతామని ఆయన తెలిపారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి ది ఎర్త్ సెంటర్‌లో శనివారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో యంగ్ లీడర్స్ కార్యక్రమం సీజీఆర్ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. యూత్ లీడర్ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి 500మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి బాలకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతరించిపోతున్న ప్రకృతి, సహజ సంపద, జీవరాశులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే జీవ జాతుల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జీవ వైవిధ్యం పరిరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, దిలీప్ రెడ్డి, నర్సింహారెడ్డి, డాక్టర్ నవీన్ రావు, జగన్, ప్రియ, డాక్టర్ వసంతలక్ష్మి, సీజీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరికి వడగండ్ల గండం

- ముంచుకొస్తున్న మబ్బులు
- రైతుల్లో గుబులు

8



అవగాహన



మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ శ్రీలత

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ర్యాంప్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత అన్నారు. ఎస్‌హెచ్‌జీ అండ్ మహిళా పారిశ్రామిక వేత్తలకు ర్యాంప్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిధులతో నిర్వహిస్తున్న ర్యాంపు ప్రోగ్రాం రెండేళ్లపాటు కొనసాగనున్నట్లు చెప్పారు. ఈ ప్రోగ్రాంలో ఎంపికైన మహిళా పారిశ్రామిక వేత్తలు వారి బిజినెస్‌ను వృద్ధి చేసుకుని ఆదాయం పెంచుకునే అవకాశం లభిస్తుందని ఆమె తెలిపారు. వీహబ్ డైరెక్టర్ జాహిద్ అక్తర్‌షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ, డీపీఎంలు, ఏపీఎంలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకులు శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతి పత్రం సమర్పించారు. అల్లర్లకు పాల్పడే దేశ, హిందూ వ్యతిరేక శక్తులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ ప్రాంత సహకార దర్శి చింతల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్, కార్యదర్శి ఎం.రాజు, రాఘవేందర్, రాంరెడ్డి, మహేష్, రాఘవేందర్, విక్రమ్, శ్రీశైలం, తోళ్ల ప్రవీణ్ డిమాండ్ చేశారు.

జోరువాన



శంషాబాద్ మండలం పాల్మాకుల గ్రామంలో జోరువాన కురిసింది. శనివారం సాయంత్రం ఈదురుగాలుల వర్షం కురవడంతో హైవే పై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దారి కనిపించక లైట్లు వేసుకొని వాహనాలను నడపాల్సిన పరిస్థితి నెలకొంది. వాన నీటితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. - ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

22న కొందుర్గులో సదస్సు

చౌదరిగూడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో ఈ నెల 22న నిర్వహించే భూ భారతి అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ సి. నారాయణరెడ్డి హాజరుకానున్నట్లు తహసీల్దార్ జగదీశ్వర్, రమేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, ఆర్ఐలు శ్రీనివాస్‌రెడ్డి, శివ, కొందుర్గు ఎస్సై రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్

పరిశ్రమల్లో కాలుతున్న కలప

- బాయిలర్ కోసం వినియోగం
- పచ్చని చెట్లను నరుకుతున్న వ్యాపారులు
- నిబంధనలకు విరుద్ధంగా వినియోగం
- అధికారుల ఆదేశాలు బేఖాతర్



నందిగామ పారిశ్రామికవాడ పరిశ్రమల్లో కలప

నందిగామ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నందిగామ మండల పరిధిలో వివిధ పరిశ్రమలు ఉన్నాయి. వాటిల్లో వాడే బాయిలర్ వినియోగం కోసం నిబంధనలకు విరుద్ధంగా కలపను ఉపయోగిస్తున్నారు. కొందరు వ్యాపారులు స్వలాభం కోసం పచ్చని చెట్లను నరికి అక్రమంగా పరిశ్రమలకు కలపను తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. బహిరంగంగా ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలో అనే పరిశ్రమలు ఉండటంతో కాలుష్యం పెరిగిపోయింది. చెట్లను నరకడం కారణంగా ఈ ప్రాంతంలో కాలుష్యం మరింత పెరిగి వ్యాధుల బారిన పడ్తామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందిగామ పారిశ్రామికవాడలోని కొన్ని పరిశ్రమల్లో ఉపయోగించే బాయిలర్లకు చెట్లను నరికి అటవీ సంపదను

మిగతా 10వ పేజీలో...

చెట్లు నరకడం పర్యావరణానికి ప్రమాదం



చెట్లను నరకడం పర్యావరణానికి ప్రమాదం. పరిశ్రమల్లో బాయిలర్ కోసం కలపను వినియోగించకూడదని నిబంధనలున్నా దర్జాగా ఉపయోగిస్తున్నారు. అటవీశాఖ, పర్యావరణ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణం. వారి స్వలాభం కోసమే తూతూ మంత్రంగా తనిఖీలు చేపడతారు. చెట్లను నరికితే మానవ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. ఇప్పటికైనా అధికారులు అక్రమంగా బాయిలర్‌ల కోసం కలపను ఉపయోగిస్తున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– అంజుయాదవ్, అడ్వకేట్, నందిగామ

‘భూ భారతి’తో వివాదాలు పరిష్కారం

- ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం : కలెక్టర్ నారాయణరెడ్డి
- భూ భారతి చట్టం రైతుల చుట్టం : చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య
- చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపాలిటీల్లో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కన్వెన్షన్‌లో, శంకర్‌పల్లిలో బద్దం మాణిక్‌రెడ్డి గార్డెన్‌లో వేర్వేరుగా భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధరణిలోని లోపాలను సవరించి రైతుల భూ కష్టాలను తీర్చేందుకే సీఎం రేవంత్ రెడ్డి భూ భారతి పోర్టల్‌ను

మిగతా 10వ పేజీలో...

ముమ్మరంగా ఫెన్సింగ్ పనులు

ఫార్మాసిటీ భూముల సర్వే పనులను పరిశీలించిన డీసీపీ, ఆర్‌డీవోలు

యాచారం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు హద్దుల గుర్తింపు, ఫెన్సింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో 120 కిలోమీటర్లకు గాను శనివారం నాటికి 13 కిలోమీటర్ల మేర ఫెన్సింగ్ బిగించారు. మిగిలిన ప్రాంతాలలో ఇనుపరాడ్ల బిగింపు, హద్దుల గుర్తింపు పనులు చేస్తున్నారు. సుమారు 80 మంది కార్మికుల చేత పనులు శరవేగంగా సాగుతున్నాయి. కుర్మిద్దలో ఫార్మాసిటీ కోసం తీసుకోకుండా ఉన్న భూములకు హద్దులు గుర్తించరాదని కొందరు రైతులు అభ్యంతరం చెప్పారు. దీంతో ఫార్మాసిటీ కోసం సేకరించని భూములకు హద్దులు గుర్తించడం లేదని ఆర్‌డీవో అనంతరెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ రైతులకు సూచించారు. కోర్టు వివాదంలో ఉన్న భూముల జోలికి వెళ్లడం లేదని తెలిపారు. గుట్టల్లో హద్దుల గుర్తించి వెంటనే ఇనుపరాడ్లను బిగిస్తున్నారు. పనులను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సిఐ లిక్కి కృష్ణంరాజు పరిశీలించారు. వారు కూలీలతో మాట్లాడి ఇబ్బందులు తెలుసు కున్నారు. కార్మికులకు తాగునీటినందించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులుంటే తక్షణమే పోలీసులకు సమాచారమందించాలని డీసీపీ కూలీలకు సూచించారు.

భూ భారతితో రైతుల సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

బంట్వారం ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భూభారతితో భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం బంట్వారం రైతు వేదికలో భూభారతి రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతూ... ధరణిలో పరిష్కారం కాని సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం దొరుకుతుందన్నారు. మోసపూరితంగా ఎవరైనా రికార్డులు చేసినట్లయితే దానిని రద్దు చేసే అధికారం ఈ చట్టంలో ఉందన్నారు. మ్యుటేషన్లో అభ్యంతరాలుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకునే అవకాశముందన్నారు. పెండింగ్ సాదాబైనామాలను క్రమబద్ధీకరించి పట్టా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఏవో శ్రావ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్సై శ్రీశైలం, నాయకులు వెంకటేశం,యాదగిరి, నర్సింలు, ఇసాక్, ప్రభాకర్, అరుణ్, మహేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వరికి వడగండ్ల గండం

- కమ్ముకొస్తున్న మబ్బులు
- రైతుల్లో గుబులు



కొద్ది రోజుల్లో కోతకు రానున్న వరి పంట

యాచారం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సాగైన వరి పంట దాదాపు చేతికొచ్చింది. నీరందక ఎండిన పంట పోను పారిన చేను మరో పదిహేను రోజుల్లో కోతకు రానుంది. ఈ నేపథ్యం వేసవి వానలు, వడగండ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వానొచ్చి ఎక్కడ చేతికొచ్చిన పంట నేలపాలవుతుందోనని భయపడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో యాసంగిలో 93,500 ఎకరాల్లో వరి వేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో 7,500ఎకరాలు, తలకొండపల్లిలో 7,000 ఎకరాలు,యాచారంలో 4350ఎకరాల మేర వరిసాగు చేశారు. దీంతో 65,560 టన్నుల వడ్లు పండుతాయని అధికారుల అంచనా. ఇబ్రహీంపట్నం చెరువులో నీరుండడంతో సమీప గ్రామాల్లో భూగర్భ జలమట్టం పెరిగి బోర్ల కింద వరి వేశారు. మరో 15 రోజుల్లో వరి చేతికందుతుంది. కాగా ముందు నాట్లేసిన వరి ఇప్పటికే కోశారు. ఎండ కాలంలో ఉన్నట్టుండి క్యూములోనింబస్ మేఘాలు కమ్ముకొని కుండపోత వర్షం పడుతుంది. అలాగే కొన్నిసార్లు వడగండ్లు సైతం పడతాయి. కోతకొచ్చిన వరి చేన్లలో వడ్లన్నీ రాలుతాయి. ఈదురుగాలులకు కూడా వడ్లు రాలతాయి. ఇదిలా ఉంటే ఇటీవల వడగండ్ల వానకు యాచారం మండలంలో 214ఎకరాల్లో, తలకొండపల్లిలో 87 ఎకరాలలో, మంచాలలో 90ఎకరాల్లో వరి పంట పాడైంది. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో 15శాతం పంట మాత్రమే కోశారు. కోతకొచ్చిన పంట వానలతో ఎక్కడ చేతికందకుండాపోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

మామిడితోటలకు అపార నష్టం

ఇదిలా ఉండగా బారీ ఈదురు గాలుల కారణంగా 85శాతం మేర మామిడి కాయలు నేలరాలి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కాత బాగా పట్టిందని ఆనందించిన రైతులపై వర్షాలు నీళ్లకు మ్మరించాయి. ఇప్పటికే సగం మామిడి నేలరాలింది.

పంట చేతికందుతుందనే నమ్మకం లేదు



నీరందక ఇప్పటికే ఎకరం వరిపంట ఎండిపోయింది. వారం రోజుల క్రితం కురిసిన వడగండ్లతో మరి కొంత పంట పాడైంది. ఉన్న పంటైనా చేతికందుతుందో లేదోనని భయమైతోంది. మేఘాలనుచూస్తే వానొస్తుందేమోనని ఆందోళన కలుగుతోంది. మరో పదిహేను రోజులైతే పంట కోతకొస్తుంది.

- బైకని శ్రీనివాస్, రైతు, కుర్మిద్ద

పాడైన పంట వివరాలు సేకరించాం



ఇటీవలి వడగండ్లతో పాడైన పంటల వివరానలు ప్రభుత్వానికి నివేదించాం. రైతులు కష్టపడి పంట పండిస్తే అకాల వర్షాలతో పంట పాడవడం వారికి తీవ్ర నష్టం. గ్రామాల్లో పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశాం. నివేదికలు ప్రభుత్వానికి పంపి రైతులను ఆదుకునేందుకునేందుకు కృషి చేస్తున్నాం.

- నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో అన్నదాతలు

బషీరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు కురుస్తుండటంతో ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్న తల పట్టుకుంటున్నారు. వరిపంట చేతికొచ్చే దశలో ఈదురు గాలులతో కూడిన వర్షాలతో గింజ పట్టిన వరిపైరు నేలకొరిగి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బషీరాబాద్ మండలంలో నాలుగైదు రోజులుగా సాయంత్రం పూట మబ్బులు కమ్ముకుంటూ ఈదురుగాలులతో వర్షం పడుతోంది. ఈ వర్షాలతో పొలాల్లోని ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టామని, వారం, పది రోజుల వ్యవధిలో వరి పంట చేతికొస్తుందని.. ఈ సమయంలో వానొచ్చి వడ్లు తడిస్తే దిగుబడి, ధర తగ్గే అవకాశం ఉందని రైతులు దిగులుపడుతున్నారు.



బషీరాబాద్‌లో కోతకొచ్చిన వరి చేను

మంచాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలు సైతం సర్వతోముఖాభివృద్ధి సాధించేలా కార్యక్రమాలు చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే రంగారెడ్డి



ఆగాపల్లి-నోముల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మండల పరిధి ఆగాపల్లి, కాగజ్‌ఘట్, జాపాల, హస్మత్‌పూర్ గ్రామాల్లో రూ.4.72 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఇంకా ముఖ్యమం త్రి సహాయ నిధి పథకం కింద మంజూరైన రూ. 12,69,500 విలువైన చెక్కులను లబ్దిదారులకు పంపి ణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ము ఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని కొ నియాడారు. గ్యారెంటీల అమలు, మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకందజేస్తామన్నారు. భారీగా నిధు లు తెచ్చి అభివృద్ధి చేస్తా మన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, బి.మహిపాల్, జయమ్మమల్లేష్, ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ హన్మంతరెడ్డి, ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, రమాకాంత్‌రెడ్డి, వెంకటేశ్, జంగయ్య, ఎల్లే శ్, ఎడ్మ నరేందర్‌రెడ్డి, జయానందం, వాజిద్, లావణ్యబాలశివుడు, ఐలేశ్, చంద్రయ్య, ఎం.సురేష్, నాగరాజు, సికిందర్‌రెడ్డి, రాఘవ, రాజేష్, శివ, అష్రఫ్, వి.రాంరెడ్డి, బి.జగన్, పి.శ్రీనివాస్, పి.మూర్తి పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రాజకీయ పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం కవ్వగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ మౌలిక లక్షణాలను చెరిపేసేలా బీజేపీ వ్యవహరిస్తోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఎలా అవమానపరుస్తూ, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందో ప్రజలకు వివరించాలని కార్యర్తలకు సూచించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని కవ్వగూడ, నర్కూడలో ఎమ్మెల్యే, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ల అధ్వర్యంలో నిర్వహించారు. కవ్వగూడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జైసంవిధాన్ అభియాన్ గొప్ప కార్యక్రమం అని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం పార్టీ చేసిన పోరాటాలు, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జానకీరామ్, నాయకులు నీరటి తన్వీరాజు, శేఖర్‌యాదవ్, సంజయ్, వెంకటేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, అశోక్, సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కవ్వగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చైర్మన్ జ్ఞానేశ్వర్

ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

శంషాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో తెలంగాణలోని వివిధ జిల్లాల నాయకులు పాల్గొంటారన్నారు. శంషాబాద్ బస్టాండ్ నుంచి శంషాబాద్ ఎంఎంఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. కార్మికుల సమస్యలపై సభలో చర్చిస్తామన్నారు. భవన నిర్మాణ వలస కార్మికులతో 14గంటలు పనిచేయిస్తూ శ్రమదోపిడీ చేస్తున్న కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకునే వరకు ఒత్తిడి తెస్తామన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తులో వారి సమస్యలు పరిష్కరించే విధంగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సామిడి శేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు నర్రా గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత



ఎస్పీ నారాయణరెడ్డితో ప్రమోషన్ పొందిన హెడ్‌కానిస్టేబుళ్లు

వికారాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):ఉద్యోగో న్నతి కేవలం హోదాలో మార్పు కాదని, ఇది ఉద్యోగిపై మరింత పెరిగిన బాధ్యత అని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లాలో 17మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ రాగా వారిని ఎస్పీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నూతన హెడ్‌కానిస్టేబుళ్లు విధుల నిర్వహణలో మ రింత అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. నిబంధనలను, చట్టాలను పాటిస్తూ తమ పరిధి జూనియర్ సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. పదోన్నతిపొందిన హెడ్‌కానిస్టేబుళ్లు బాగా పనిచేయాలని సూచిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిన బీజేపీ

ఆమనగల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):ఇతర రాజకీయ పార్టీలను తోసిరాజని బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎస్‌టీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. తమ విధానాలు, పథకాల అమల్లో నిర్లక్ష్యంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజా విశ్వాసం కోల్పోయాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్వకుర్తిలో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మాడ్గుల మండల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆచారి హాజరై పార్టీ క్రియాశీల సభ్య త్వాలు, పార్టీ బలోపేతం, ప్రజాస మస్యలపై పోరాట కార్యాచరణను రూపొందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనా దక్షతతో పదేళ్లలో దేశం ఎన్నో విజయాలు సాధించిందన్నారు. బీజేపీకి తిరుగులేదని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో గోరటి నర్సింహ్మా, శివరామ్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, వెంకటేశ్, శ్రీను, మహేదేవ్‌శర్మ, కె.వెంకటేశ్, రవినాయక్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

పెన్సిల్ మొనలపై కళాఖండాలు



థర్మకోల్‌తో భారతదేశం, భరతమాత, పరిపూర్ణానంద శిల్పాలు

మంచాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మంచాల మండల పరిధిలోని కాగజ్‌ఘట్‌కు చెందిన కరుణాచారిది నిరుపేద కుటుంబం. ఉత్తరపల్లి రాములమ్మ-చంద్రయ్యలకు నలుగురు కొడుకులు, ఓ కూతురు. వారిలో కరుణాచారి మూడోసంతానం. ఆయనకు చిన్నతనం నుంచే కళానైపుణ్యం ఏర్పడింది. అందరిలా కాకుండా కొత్తగా ఏదైనా చేయాలనే ఆలోచనతో తన కళకు పదును పెట్టాడు. చాక్‌పీసులు, పెన్సిల్ మొనలపై అద్భుత కళాఖండాలు చెక్కుతూ నైపుణ్యాన్ని చాటుతున్నాడు. బీఎస్సీ, బీఈడీ చదివిన కరుణాచారి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే సమయం చిక్కినప్పుడల్లా మైక్రో ఆర్ట్స్ తయారు చేస్తున్నాడు. మహాత్మా గాంధీ, స్వామీ వివేకానంద తెలంగాణ తల్లి, నరేంద్రమోదీ, కేసీఆర్ వంటి ప్రముఖుల చిత్రాలను చాక్‌పీసులు, పెన్సిల్ మొనలపై మలుస్తూ మన్ననలు పొందుతున్నాడు.

థర్మోకోల్‌తో సినిమా సెట్టింగ్‌లు..

కరుణాచారి కాలానుగుణంగా విభిన్నమైన ప్రతిభాపాటవాలను చాటుతున్నాడు. థర్మకోల్‌తో సినిమా సెట్టింగ్‌లు తయారు చేయడంలోనూ మంచి ప్రావీణ్యం ఉంది. జై మాహిష్మతీ పేరు వింటే గుర్తుకు వచ్చే బాహుబలి సినిమా సెట్టింగ్‌లో థర్మకోల్‌తో టేబుల్ సైజులో రూపొందించి భళా అనిపించుకున్నాడు. బాహుబలి సినిమాలో అబ్బుర పరిచే దృ శ్యాలతో కూడిన థర్మకోల్ సెట్టింగ్‌ను కేవ లం నెల రోజుల్లోనే సృష్టించి అబ్బురపరిచాడు. అదీ కేవలం రూ.4 వేల ఖర్చుతోనే మాహిష్మతీ కోటతో పాటు బాహుబలి సినిమాలోని పాత్రదారుల చిత్రాలు, యుద్ధ సన్నివేశాలు, గోదె, బాల్‌తో శత్రువులపై దాడి చేసి బండి, బాణాల రూపకల్పన చేయడమేగాకుండా వీటిని ప్రయోగించే విధంగా తయారు చేశాడు.


చాక్‌పీస్‌పై సింగం సినిమాలో హీరో సూర్య రూపం

ఆటుపోట్లతో జీవన ప్రయాణం..

కరుణాచారి జీవన ప్రయాణం అనేక ఆటుపోట్లతో సాగింది. తల్లిదండ్రులు పనిచేసే వడ్రంగి కులవృత్తితో వచ్చే తిండి గింజలతోనే అన్నదమ్ముల విద్యాభ్యాసం సాగింది. ఇంటర్మీడియట్ చదివే వయసులోనే కరుణాచారి రోడ్డు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని సుమారు రెండేళ్లపాటు మంచానికే పరిమితమయ్యాడు. కొద్దికాలానికే ఆ కుటుంబంలో పెద్దకుమారుడు ఆనారోగ్యానికి గురై ఆకస్మికంగా మృతి చెందాడు. ఇన్ని ఆటుపోట్లలోనూ విద్యాభ్యాసం పూర్తిచేసిన కరుణాచారి ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు...

మైక్రో ఆర్టిస్టుగా ప్రతిభను చాటుతున్న కరుణాచారికి ఇటీవలే తెలుగు బుక్ అవార్డు పురస్కారం లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువాళ్ల గొప్పతనాన్ని గుర్తించే ఈ సంస్థ చాక్‌పీసులు, పెన్సిల్ మొనలపై మైక్రోఆర్ట్‌ను గుర్తించి తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కరుణాచారి పేరుచేర్చి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

అవకాశం వస్తే సినిమాల్లో పనిచేస్తా..

ఆర్ట్ వేయడం అంటే నాకు చిన్ననాటి నుంచి ఇష్టం. మైక్రో ఆర్టిస్టుగా పెన్సిల్ మొనలు, చాక్ పీసులతో నేను చేసిన ఎన్నో కళాఖండాలు ఇప్పటి వరకు ప్రదర్శన వరకే ఉపయోగపడుతున్నాయి. ఆర్థికంగా ఉపయోగం లేకుండా పోతోంది. నాకు అవకాశం వస్తే సినిమా సెట్టింగుల ఏర్పాటులో పనిచేయాలని ఉంది. దీంతో నాకు నచ్చిన పనిచేస్తూ కుటుంబానికి చేయూత అందించాననే తృప్తి కలుగుతుంది.

- కరుణాచారి, మైక్రో ఆర్టిస్ట్

'ఆంధ్రజ్యోతి' బైక్ విజేతకు చెక్కు అందజేత

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో బైక్‌ను గెలుచుకున్న సిద్దిపేటకు చెందిన సొప్పదండి వేణుకృష్ణకు శనివారం చెక్కు అందజేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా వేణుకృష్ణకు చెక్కు అందజేశారు. తనకు వచ్చిన బహుమతితో వేణుకృష్ణ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. 'ఆంధ్రజ్యోతి' పాఠకుడిగా ఉండటం వల్ల వార్తవిశేషాలు తెలుసుకోవటంతో పాటు బహుమతిని గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు.


వేణుకృష్ణకు చెక్ అందజేస్తున్న హరీశ్‌రావు

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

పరిగి/శంకర్‌పల్లి/కడ్తాల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన విద్యార్థి ప్రతిభను చాటారు. జాతీయ స్థాయిలో 103 ర్యాంకు సాధించారు. పరిగి పట్టణానికి చెందిన కనకం గౌరీశంకర్ కుమారుడు కె.ప్రణవ్ జేఈఈ మెయిన్స్ రాశాడు. జాతీయస్థాయిలో జనరల్ కేటగిరిలో 103వ ర్యాంకు సాధించి 99.996శాతం మార్కులు సాధించాడు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్‌కు చెందిన అంజిరెడ్డి, జ్యోతి దంపతుల కుమారుడు జస్వంత్‌రెడ్డి జేఈఈలో 98.46శాతం మార్కులతో 23,577వ ర్యాంకు సాధించాడు. కడ్తాల్ మండల పరిధిలో చల్లంపల్లికి చెందిన మహిపాల్‌రెడ్డి 94.34 మార్కులు సాధించాడు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

కల్యాణలక్ష్మితో పేదల బతుకుల్లో వెలుగు


చెక్కులు అందిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వెలుగులు తెచ్చాయని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మోమిన్‌పేట్ రైతువేదికలో చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వం పేదింటి ఆడపడచుల పెళ్లిళ్లకు సహాయం అందిస్తోందన్నారు. 42మందికి చెక్కులను స్పీకర్ అందించారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, డీటీ సురేశ్, సుభాష్‌గౌడ్, సురేందర్, ఏరాజ్‌పాష, ఏజాజ్‌పాష, బాగ్దాద్, నర్సింహారెడ్డి, వెంకటయ్య, మానయ్య యాదవ్, రవి, అస్లాం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలోనే జరగగా నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దురుసుగా మాట్లాడుకున్నారు. చేసేదేమి లేక స్పీకర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశం రసాభాస

ఘట్‌కేసర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లో శనివారం జరిగిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశం రసాభాస అయ్యింది. కమ్యూనిటీ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ ఆధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు, బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. తమకు సమాచారం ఇవ్వలేదని కొందరు నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పర విమర్శలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఛైర్‌పర్సన్ పావని, నాయకులు ముత్యాలు, రమేష్, ఖయ్యూం, వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, అంజనేయులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాలంచెల్లిన వాహనాలతో కాలుష్యం!

(7వ పేజీ తరువాయి)

తిరిగేందుకు అనుమతి ఇవ్వమని ప్రకటించారు. అయితే దీనిపై వాహనదారుల నుంచి ముఖ్యంగా క్యాబ్, ఆటో నడిపే వారి నుంచి వ్యతిరేకత రావడంతో అమల్లో వెనక్కి తగ్గారు.

నిబంధనలు బేఖాతర్

వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 15ఏళ్లు పైబడిన వాహనాలను గడువుతీరినట్లుగా పరిగణిస్తారు. సరుకు రవాణాచేసే వాహనాలేతై 10ఏళ్లు దాటితే గడువు తీరినట్లే. వీటికి ఫిట్‌నెస్ సామర్థ్యం ఉంటే గ్రీన్‌టాక్స్ కట్టించుకొని మరో ఐదేళ్ల పాటు రోడ్లపై తిరిగేందుకు అనుమతి ఇస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలకు అనుమతులు తీసుకోకుండా గ్రీన్‌టాక్స్ కట్టకుండా ఉంటే పట్టుబడిన సమయంలో భారీగా జరిమానా విధిస్తారు. అలాగే ఏ వాహనమైనా కూడా కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం లేకుండా రోడ్డుపై తిరిగే వీలులేదు. వీటిని ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. నగర, శివారు ప్రాంతాల్లో భారీగా గడువు తీరిన వాహనాలున్నాయి. వీటి మెయింటెనెన్స్ కూడా అంతంత మాత్రమే. ఫిట్‌నెస్ లేకుండానే వాహనాలను విచ్చలవిడిగా నడుపుతున్నారు. వీటివల్ల కాలుష్యం పెరగడంతో పాటు భద్రత కూడా ప్రశ్నార్థకరంగా మారింది. రోడ్డు ప్రమాదాలకు కాలం చెల్లిన వాహనాలే కారణంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అత్యధికంగా కాలంచెల్లిన వాహనాలు తిరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కాలం చెల్లిన వాహనా లు 24లక్షల వాహనాలు ఉండగా ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 10లక్షలకుపైగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 4.9లక్షలు, మేడ్చల్‌లో 4.7లక్షలు, వికారాబాద్ జిల్లాలో 50వేలకుపైగా కాలం చెల్లిన వాహనాలున్నాయి. వీటిల్లో 75శాతం టీవీలర్లే!



ఏక్యూఐ 200 దాటేస్తుంది...

వాహనాల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాలు అధికంగా ఉండడంతో శ్వాసకోశ సంబంధ వ్యాధులు, ఇతర ప్రాణాంతక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నగర శివార్లలో పట్టణీకరణ శరవేగంగా సాగడంతో వాహనాల రద్దీ భారీగా పెరిగింది. దీంతో వాహనకాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణంగా వాయి నాణ్యత స్థాయి(ఏక్యూఐ) 50 పాయింట్లలోపు ఉంటే వాతావరణంలో స్వచ్ఛమైన గాలి ఉన్నట్లుగా పరిగణిస్తారు. అదే ఏక్యూఐ 100పాయింట్లు దాటితో కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు చెబుతారు. నగరశివార్లలోని అనేక ప్రాంతాల్లో చాలాసార్లు ఏక్యూఐ 200పాయింట్లు దాటుతోంది. దీనికి పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యమే కాక వాహనాల నుంచి వెలువడే కాలుష్యం కూడా కారణమే. వాయి కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్, పెట్రోల్ వాహనాలను నియంత్రించి వాటి స్థానంలో ఎలక్ట్రికల్ వెహికల్స్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే వాయి కాలుష్యానికి డీజిల్, పెట్రోల్ కాకుండా వాహనాల టైర్లు, బ్రేక్‌ప్యాడ్లు, రోడ్లు కూడా కారణమవుతున్నాయి.

ఆన్‌లైన్ ద్వారానే జరిమానాలు

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలకు జరిమానాలు వేస్తున్న విధంగానే కెమెరాల ఆధారంగా కాలుష్య వాహనాలకు జరిమానాలు వేసే విధానాన్ని అమల్లోకి తేనున్నారు. ఇందుకు రియల్ టైమ్ ఎన్ఫోర్స్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నారు. కొత్తగా కొన్న వాహనాలకు ఏడాది వరకు పొల్యూషన్ అండ్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్ అవసరం లేదు. తరువాత ప్రతి ఆరు నెలలకోసారి(పీయూసీ) సర్టిఫికెట్ పొందాలి. ఇప్పటివరకు దీన్ని పెద్దగా ఎవరూ పాటించడం లేదు. రోడ్డు మీద వెళ్లే వాహనాలు ఆపి తనిఖీచేస్తే తప్పా పీయూసీ సర్టిఫికెట్ ఉందో లేదో తెలియదు. ఇపుడు వాహన కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం తాజాగా వెహికులర్ పొల్యూషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(వీపీఎంఎస్)ను అమల్లోకి తెస్తోంది. దీని ప్రకారం వాహనాలకు జారీచేసే పీయూసీ సర్టిఫికెట్లన్నీ ఇక ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు. పోలీసు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా తరుచూ వాహనాల నంబర్లను స్కాన్ చేస్తారు. దీని ఆధారంగా కూడా గడువు తీరిన వాహనాలకు ఆటోమెటిక్‌గా చలానాలు విధిస్తారు.

తుక్కుగా మార్చితే ప్రోత్సాహకాలు

కాలం చెల్లిన వాహనాలను తక్కుగా మారిస్తే ప్రభుత్వ ప్రోత్సాహకాలు లభిస్తాయి. కొత్త వాహనాల కొనుగోలులో 10శాతం రాయితీ కల్పిస్తున్నారు. అంతేకాక ఈవీ (ఎలక్ట్రికల్ వెహికల్స్) వాహనాలు కొనుగోలు చేస్తే జీవిత కాలం పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేసింది. రోడ్డు పన్నులు మినహాయిస్తున్నారు.

గాలివాన బీభత్సం


చేవెళ్ల: కేసారంలో వాలిన విద్యుత్ స్తంభం


ఎన్కెపల్లిలో నేలవాలిన మొక్కజొన్న చేనులో రైతు కిష్టయ్య


ధారూరు: ధారూరులోని రోడ్డుపై పడిపోయిన కొబ్బరి చెట్టు

చేవెళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల గాలివాన బీభత్సం సృష్టించాయి. విద్యుత్ స్తంభాలు కూలి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. చేవెళ్ల మండలంలో శనివారం సాయంత్రం బలమైన గాలులు వీచాయి. కొద్దిపాటి వర్షం కురిసింది. గాలలతో కేసారం విద్యుత్ స్తంభం విరిగింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వడంతో విద్యుత్ సరఫరా నిల్పివేశారు. పంట పొలాల్లో చెట్లు విరిగిపడ్డాయని రైతులు పేర్కొన్నారు.

కోట్‌పల్లి: మండల కేంద్రం, ఎన్కెపల్లి గ్రామాల్లో గాలివాన బీభత్సానికి పంటలు నష్టం జరిగింది. ఎంన్కెపల్లిలో కిష్టయ్య అనే రైతు మొక్కజొన్న నేలకొరిగింది. కోట్‌పల్లిలో బుచ్చమ్మ ఇంటి పైకప్పుఎగిరిపోయింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సరఫరా నిలిచిపోయింది.

ధారూరు: శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో గాలివాన ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ధారూరు సంతలో కూరగాయల మార్కెట్‌లో కూరగాయాలు వాన నీటిలో కొట్టుకుపోయాయి.

నేల రాలిన పంటల పరిశీలన

తాండూరు రూరల్: అంతారం, అంతారంతండా, ఖాంజాపూర్, బెల్కటూర్, ఎల్మకన్నె, చెంగోల్, గోనూరు తదితర గ్రామాల్లో వర్షానికి వరిపంట రాలిపోయింది. వ్యవసాయ అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. శనివారం ఏఈవో శివకుమార్ పర్యటించి వివరాలు సేకరించారు. కోత దశలో ఉన్న వరి గాలివానకు రాలిపోయిందని రైతులు వాపోయారు. తాండూరు నియోజకవర్గంలో 350ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. బషీరాబాద్, పెద్దేముల్, యాలాల, తాండూరు మండలాల్లో నష్టం వాటిల్లిందన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

మర్పల్లి: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మర్పల్లి, కొత్లాపూర్‌లలో దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం అందేలా కృషిచేస్తారని తెలిపారు. అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. ఏవో శ్రీకాంత్, హర్టికల్చర్ అధికారి అక్షితరెడ్డి ఉన్నారు.

ఆదుకోండి సారూ...

పెద్దేముల్: వడగండ్లతో వరిపంటను కోల్పోయామని, తమను ఆదుకోవాలని జనగాం, మంబాపూర్ గ్రామాల రైతులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. మన్‌సాన్‌పల్లి, మంబాపూర్, దుగ్గాపూర్, మారెపల్లి, జనగాం, కొండాపూర్, మారెపల్లితండా గ్రామాల్లో రెండు రోజుల క్రితం వడగండ్లవాన కురిసింది. కోతకొచ్చిన వరిపంట దెబ్బతింది. శనివారం రైతులు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి గోడువెల్లబోసుకున్నారు. ఎమెల్యే స్పందించి అధికారులకు ఫోన్‌చేసి రైతులకు కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు.


తాండూరు రూరల్: ఖాంజాపూర్‌లో పంటను పరిశీలిస్తున్న ఏఈవో


మర్పల్లి: అరటి పంటను పరిశీలిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి


నానక్‌నగర్‌లో టీజీఐఐసీ, రెవెన్యూ, అటవీ, పోలీస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

రైతుల సమస్యలు పరిష్కరిద్దాం

● డీసీపీ సునీతారెడ్డి, ఆర్‌డీవో అనంతరెడ్డి

యాచారం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):పనులు చేస్తున్న చోటకు రైతులు వచ్చి అడ్డుకుంటే వారిని శాంతియుతంగా సముదాయించాలి. మీకేమైన ఇబ్బందులుంటే నేరుగా తనకు లేదా ఏసీపీలకు సూచించాలి అని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంతరెడ్డిలు అన్నారు. శనివారం యాచారం మండలం నానక్‌నగర్‌లో అటవీ, రెవెన్యూ, టీజీఐఐసీ, పోలీస్ శాఖల సిబ్బంది, అధికారులతో వారు మాట్లాడారు. ఇంత కాలం భూమిని నమ్ముకొని పంటలు పండించుకుంటున్న రైతుల పొలం పోతే వారికి బాధగా ఉంటుందని, అందుకే వారు కొన్నిసార్లు నిరసనలు వ్యక్తం చేస్తుంటారని అన్నారు. భూముల విషయంలో కోర్టుల్లో కేసులుంటే వాటికి ఫెన్సింగ్ చేయకుండా వదిలేయాలన్నారు. ఫార్మాసిటీ భూములకు ఫెన్సింగ్ పనులను రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైతులను సముదాయించి పనులు చేసుకోవాలన్నారు. నేడు సాఫీగా పనులు చేస్తున్నారంటే అందరి కృషి పట్టుదల వల్లేనని గుర్తు చేశారు. ఉద్యోగులమంతా ప్రజల కోసమే అనే భావనతో ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, స్పెషల్ పార్టీ ఏసీపీ సురేష్, సీఐలు కృష్ణంరాజు, వేణుగోపాల్, జితేందర్‌రెడ్డి, వరుణ్, టీజీఐఐసీ జీఎం శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు. కాగా ఆర్డీవో మేడిపల్లి, పల్లెచెల్కతండా, కుర్మిద్ద గ్రామాల రైతుల గోడువిన్నారు. న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. పనులు అడ్డుకోవద్దని కోరారు. గతంలోనే ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని, ఇప్పుడు మా భూమి అని రావొద్దని కోరారు. డబ్బు రానివారుంటే వారికి తప్పకుండా ఇప్పిస్తామని చెప్పారు.

మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):కొత్తూర్ మున్సిపాలిటీని మాస్టర్ ప్లాన్‌తో తీర్చి దిద్దుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బాతుకలావణ్యదేవేందర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి, బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. కాలనీల్లో మురుగునీటి కాలువల నిర్మాణాలు, సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కౌన్సిలర్లు చెప్పారు. బహిరంగ ప్రాంతాల్లో మురుగునీరు పారుతోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీని తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్రణాళిక రూపొందిస్తున్నామని, నిధులు మంజూరు చేయించి సమస్యలను దూరం చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులంతా మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్ ఛైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు మాధవి, చంద్రకళరాజేందర్‌గౌడ్, శ్రీనివాస్, సోమ్లనాయక్, అనితశ్రీనివాస్‌గౌడ్, హేమదేవేందర్ జయమ్మజనార్థన్‌చారి, కరుణశ్రీసుదర్శన్‌గౌడ్, ప్రసన్నలతయాదయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కు

మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా హెచ్ఎండీఏ నిధులు వెనక్కు వెళ్లాయని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపాలిటీకి 10కోట్లు మంజూరు కాగా, 3కోట్లకు సంబంధించి పనులు చేశారన్నారు. 7కోట్లు వెనక్కు వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. కాగా 2025-2026కు మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్‌ను ఛైర్‌పర్సన్ ప్రవేశపెట్టారు. 40.41 కోట్ల బడ్జెట్‌కు రూ.30.98కోట్ల గ్రాంట్లు, 9.43కోట్ల సాధారణ నిధులని పేర్కొన్నారు.

వైభవంగా కలశోత్సవం

తాండూరు, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర కలిగిన తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో కలశోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం భద్రేశ్వరచౌక్‌లో మంత్రోచ్చరణలు, సంప్రదాయబద్ధంగా రథంచుట్టూ ఐదుసార్లు ప్రదర్శణలు చేసి తర్వాత రథంపైకి కలశాన్ని ఎక్కించారు. కలశపూజ కార్యక్రమానికి భ క్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గతంతో పోలిస్తే ఈ యేడాది బ్రహోత్సవాలను అత్య ంత వైభవం నిర్వహించడంతో పాటు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శరణు బసవేశ్వర ఆలయం నుంచి నగరేశ్వ ర గుడి ముందు నుంచి గాంధీ చౌక్ మీదు గా భద్రేశ్వర్‌చౌక్ వరకు కలశ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం జయ,జయ ధ్వానాల మధ్య కలశాన్ని రథంపైకి భద్రేశ్వరీకి జై అంటూ ఎక్కించారు. ఆలయం నుంచి రథం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చిన కలశానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ కాలువ సుజాత, ఆలయ కమిటీ ఛైర్మన్ పటేల్ కిరణ్, సభ్యులు, వీరశైవ సమాజం ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ రెన్యూవేషన్ కమిటీ ఛైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, సభ్యులు జాక సంగమేశ్వర్, శెట్టి సురేష్, గాండ్ల వీరన్న, కల్లూరు బస్వరాజ్, కోటం సిద్ధిలింగం, ఎం.ప్రశాంత్, గాదిగి కిరణ్‌కుమార్, జొల్లు రోహిణి, వీరశైవ సమాజం ప్రతినిధులు బస్వరాజ్, సద్గి భద్రణ్ణ, బస్వరాజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


భద్రేశ్వర జాతరలోని రథం


కలశాన్ని రథంపై ఎక్కించే ముందు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కె.సుజాత, తదితరులు

రథోత్సవం కోసం భారీ బందోబస్తు

భద్రేశ్వర ఉత్సవాల్లో భాగంగా ప్రధానఘట్టం రథోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 20మంది ఎస్ఐలు,పదకొండు ఏఎస్ఐలు, 30మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 41మంది హోంగార్డులతో బందోబస్తును నిర్వహించారు.

ఎమ్మెల్సీ దయాకర్.. నోరు అదుపులో పెట్టుకో

చేవెళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అద్దెంకి దయాకర్ ప్రధాని నరేంద్రమోదీని వాడువీడు అనడం సంస్కారం కాదని, అతడు నోరు అదుపులో పెట్టుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం ధ్వజమెత్తారు. శనివారం చేవెళ్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీగా పదవి చేపట్టిన దయాకర్ మంత్రి పదవివిస్తారేమోనని ప్రధాని నరేంద్ర మోదీపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ఒక చట్ట సభ సభ్యుడిగా అతడికి తగదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎక్కడ.. దయాకర్ ఎక్కడని ఎద్దేవా చేశారు. నీవెంత.. నీ బతుకెంత? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత జాతి తలదించుకునే పరిస్థితి తీసుకువస్తున్నావని మండిపడ్డారు. అతడు తన మాటతీరు మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాహుల్ గాంధీకి అధికారం రాకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎమ్మార్జెన్సీ పాలనలో నాయకులను జైళ్లలో పెట్టించింది కాంగ్రెస్సే అని గుర్తుచేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి సాధించిందన్నారు. దేశ రక్షణ, పేదరిక నిర్మూలనకు శ్రమిస్తున్నారని చెప్పారు. 370 ఆర్టికల్, రామ మందిరం, వక్ఫ్ బోర్డు, ట్రిపుల్ తలాక్ వంటి చరిత్రాత్మక చట్టాలు మోదీతోనే సాధ్యమయ్యాయన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, దేవుని శర్వలింగం, ఆంజనేయులుగౌడ్, మాణిక్యరెడ్డి, జయశంకర్, కృష్ణమమోహన్, జయసింహారెడ్డి, అభిలాష్‌రెడ్డి, అనంతయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్నమాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

నేడు కొంగరకలాన్‌లో సద్గురు రవిదాస్ మందిరం ప్రారంభోత్సవం

ఆదిభట్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కొంగరకలాన్‌లో జగద్గురు సద్గురు రవిదాస్ మందిరాన్ని సంత్ నిరంజన్‌దాస్ మహారాజ్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ మల్లు రవి నేడు సాయంత్రం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ, మాజీ మంత్రి మోత్కుపల్లి, విశారధన్, ఎమ్మెల్యేలు వీరేష్, సత్యనారాయణ, ప్రొ.కాశీం హాజరుకానున్నారు.

రోడ్లపై చెట్ల తొలగింపునకు వినతి

తలకొండపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లి-వెంకట్రావ్‌పేటకు వెళ్లే రహదారిలో ఇరువైపులా చెట్లు ఉండి వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. ఈమేరకు ఎంపీడీవో శ్రీకాంత్‌కు శనివారం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మలుపుల వద్ద చెట్లు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినోద్, మహేశ్, చంద్రశేఖర్, పవన్, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, అనిత
- అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ అభియాన్'


షాద్‌నగర్ రూరల్ : అవగాహన కల్పిస్తున్న వెంకటమ్మ

షాద్‌నగర్ రూరల్/ఆమనగల్లు/చౌదరిగూడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే తల్లీపిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని 1వ సెంటర్‌లో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి పౌష్టికాహారం తీసుకుంటే పిల్లలు కూడా ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగజ్యోతి, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఉదయ్ నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వారోత్సవాల కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మైమూనలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీచర్లు, వైద్య సిబ్బంది సీతాలక్ష్మి, నాగేశ్వరి, సీహెచ్‌వో విజయ్, ఎంపీహెచ్ ఈవో తిరుపతిరెడ్డి, ఆశకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు. పోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా జీవించవచ్చని హెచ్ఎం రజిత అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం జిల్లేడ్‌లో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ బాబురావు, టీచర్ అనీస్‌బేగం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించక.. అంతర్గత రోడ్లు ధ్వంసం


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పైప్‌లైన్ల నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకపోవడం వల్లనే పట్టణంలోని సీసీ రోడ్లు ధ్వంసమయ్యాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. పైప్‌లైన్ల నిర్మాణం కోసం తీసిన గోతులను వెంటనే పూడ్చాలన్న నిబంధన పట్ల సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడం వల్లనే రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని 8వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం కింద చేపట్టే పనుల్లో నిబంధనలు పాటించకున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. పైప్‌లైన్ల నిర్మాణం, నల్లా కనెక్షన్ల బిగింపు తర్వాత తీసిన గోతులను నాణ్యతా ప్రమాణాలతో ఆయా రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపై ఉందన్నారు. కానీ, షాద్‌నగర్ పట్టణంలో ఎక్కడా కూడా తీసిన గోతులను పూడ్చిన దాఖలాలు లేవని మండి పడ్డారు. దీనివల్ల లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా కావడంతో పాటు, ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నారని శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధి కోసం మంజూరు చేస్తున్న నిధులతో కాలనీలలో రోడ్లను పునర్నిర్మిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. కమిషనర్ సునీత, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ శాంతమ్మ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌పై బీజేపీ నాయకుల భగ్గు


కందుకూరు : దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంజిరెడ్డి, తదితరులు

కేశంపేట/కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మోదీని విమర్శించే స్థాయి అద్దంకి దయాకర్‌కు లేదని, ఆయన నోటిని అదుపులో పెట్టుకోవాలని బీజేపీ సీనియర్ జిల్లా నాయకుడు కర్రెడ్ల నరేందర్ రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అద్దంకి దయాకర్ నోటి దురుసుతో గతంలో ఎమ్మెల్యే టికెట్ కోల్పోయాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు మహేష్, తిరుపతి, శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, కృష్ణలు పాల్గొన్నారు. రాజకీయ స్వార్థం కోసం హిందూ దేవాలయాల మీద, ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అద్దంకి దయాకర్‌కు తగదని, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పల్లె కృష్ణాగౌడ్, జిట్ట రాజేందర్‌రెడ్డి, సాధ మల్లారెడ్డిలు డిమాండ్ చేశారు. కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్.వెంకటేష్, ఎన్.నర్సింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లేష్, ఎస్.భూమిరెడ్డి, తదితరులున్నారు.

పరిశ్రమల్లో కాలుతున్న కలప

(7వ పేజీ తరువాయి)

వినియోగిస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికారులు అక్రమ కలప వ్యాపారానికి ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అటవీశాఖ, పర్యావరణ అధికారులతో పాటు రెవెన్యూశాఖ అధికారుల నిర్లక్ష్యానికి పచ్చని చెట్లు పరిశ్రమల్లో కాలిపోతున్నాయి. నిబంధనల మేరకు ప్రతీ పరిశ్రమ ఆవరణలో 33 శాతం స్థలంలో చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలి. కానీ ఈ నిబంధనను పరిశ్రమల యాజమాన్యాలు గాలికి వదిలేశాయి. చెట్లను పెంచడం అటుంచితే ఉన్న చెట్లను నరికి పరిశ్రమల్లో బాయిలర్లకు వినియోగిస్తున్నారు. దీనిపై పర్యావరణ ప్రేమికులు అటవీశాఖ, పర్యావరణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే పరిశ్రమలను తనిఖీ చేసి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా వేల సంఖ్యలో మహావృక్షాలు పరిశ్రమల్లో కలపగా కాలిపోతుంటే భవిష్యత్తులో అటవీ సంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అక్రమంగా కలపను వినియోగిస్తున్న పరిశ్రమలపై ఆకస్మిక తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా కలపను వాడితే చర్యలు తీసుకుంటాం

పరిశ్రమలు బాయిలర్ వినియోగం కోసం కలపను అక్రమంగా వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు అటవీ శాఖ అనుమతులు లేనిది చెట్లను నరకొద్దు. కొందరు వ్యాపారులు అటవీశాఖ వద్ద అనుమతులు తీసుకొని వేప, తదితర చెట్లను నరికి పరిశ్రమలకు అందిస్తుంటారు. అక్రమంగా కలపను తరలిస్తే సహించేది లేదు.

- కమాలొద్దీన్, అటవీశాఖ అధికారి

పరిశ్రమలు బాయిలర్ కోసం కలపను వాడొద్దు

పరిశ్రమలు బాయిలర్ కోసం కలపను వినియోగించడానికి అనుమతులు లేవు. బాయిలర్ కోసం బొగ్గు, బ్రిగేట్, గ్యాస్, ఆయిల్‌ను మాత్రమే వినియోగించాలి. పరిశ్రమలు కలపను ఉపయోగిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తే అటవీశాఖ అధికారులతో కలసి ఆయా పరిశ్రమలపై చర్యలు తీసుకుంటాం.

- సురేష్, పర్యావరణశాఖ అధికారి

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం : కేఎస్ రత్నం


భోజనం చేస్తున్న రత్నం, నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. శనివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధి దేవుని ఎర్రవల్లిలోని చీర మహేందర్ నివాసంలో సన్నబియ్యంతో బీజేపీ నాయకులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం ఐదు కేజీలు రాష్ట్ర ప్రభుత్వం ఒక కేజీ బియ్యం కలిపి మొత్తం ఆరు కిలోల సన్నబియ్యం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ సర్పంచులు మాణిక్యరెడ్డి, అంజయ్య, శ్యామలయ్య, నాయకులు ఆంజనేయులుగౌడ్, వెంకట్‌రెడ్డి, శర్వలింగం, డాక్టర్ వైభవ్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, అభిషేక్‌రెడ్డి, కృష్ణమోహన్, శ్రీనివాస్, రవీందర్, తదితరులున్నారు.

'భూ భారతి'తో వివాదాలు పరిష్కారం

(7వ పేజీ తరువాయి)

తీసుకొచ్చారన్నారు. నూతన చట్టంతో రైతులకు మండల, డివిజన్ స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ- కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం రైతులకు చుట్టం అని అన్నారు. గతంలో ధరణి పోర్టల్‌తో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. కొత్త చట్టంతో తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించబడుతాయన్నారు. అంబేడ్కర్ జయంతి రోజున భూ భారతి చట్టాన్ని అమలు పరిచినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలని చెప్పారు.

రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భవిష్యత్‌లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దులు తదితర సమగ్ర వివరాలతో భూధార్ కార్డును జారీ చేయబోతుందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంలో హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉందన్నారు. ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు భూభారతి అని చెప్పారు. రిజిస్ట్రేషన్స్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే మ్యాప్ విధానం ఉంటుందన్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయబడుతుందన్నారు. ఇంటి స్థలాలకు, అబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు తప్పని సరిగా ఉంటుందన్నారు. డివిజన్ స్థాయిలోనే రైతులకు ఉచిత న్యాయ సహాయం చేసేందుకుగాను ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. త్వరలోనే గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ అధికారులను ప్రభుత్వం నియమించబోతుందన్నారు. ఎండోమెంట్, వక్ఫ్, భూదాన్, అసైన్డ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం అధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల, శంకర్‌పల్లి తహసీల్దార్లు కృష్ణయ్య, సురేందర్, ఎంపీడీవోలు హిమబిందు, వెంకయ్య, ఎంపీవో విఠలేశ్వర్, శంకర్‌పల్లి బస్‌రిజిస్ట్రార్ బాసిత్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ యోగేష్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పెంటయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బి.రాములు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, జనార్దన్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సాత ప్రవీణ్‌కుమార్, కుమ్మరి చెన్నయ్య పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను చేవెళ్లలోనే నిర్మించాలి

- కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

చేవెళ్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను చేవెళ్ల పట్టణ కేంద్రంలోనే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రానికి వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డిని ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను చేవెళ్లలో నిర్మించాలని వినతిపత్రం అందించారు. అనంతరం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చేవెళ్ల పట్టణ కేంద్రంలో స్కూల్‌ను నిర్మించడం వల్ల చుట్టుపక్కల మండలాలతోపాటు గ్రామాల విద్యార్థులందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్ష కార్యదర్శులు సమీర్, చందు తదితరులున్నారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి

హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.పెంటయ్యగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణ పరిధిలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ నారాయణరెడ్డికి ఆయన విన్నవించారు. అనంతరం మాట్లాడుతూ 2018లో హైదరాబాద్-బీజాపూర్ జాతీయరహదారి నిర్మాణానికి ప్రభుత్వం భూ సేకరణ పూర్తిచేసిందన్నారు. అప్పటి మార్కెట్ ప్రకారం పరిహారం అందించడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ఖానాపూర్ గేట్ వద్ద 24 ఇళ్లు కోల్పోతున్నారని ప్రభుత్వం అందించే పరిహారం ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా న్యాయం చేయాలని కలెక్టర్‌ను చైర్మన్ కోరారు. బాధిత రైతులు తదితరులున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా నేడు 32కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వ్యవసాయ ఫీడర్లకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ అసౌకర్యానికి రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పంట నష్టం వివరాల సేకరణ

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల క్లస్టర్ పరిధిలో 14మంది రైతులకు సంబంధించి 16 ఎకరాల 20గుంటల భూమిలో వరి పంటకు నష్టం జరిగిందని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు వ్యవసాయాధికారి నిషాంత్‌కుమార్ శనివారం తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని మహిళ మృతి

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. సుమారు 45 నుంచి 50ఏళ్ల వయస్సు కలిగిన మహిళ శనివారం తెల్లవారుజామున చటాన్‌పల్లి శివారులో మృతిచెంది ఉందని తెలిపారు. మృతదేహంపై ఎరుపు రంగు జాకెట్, వైట్, ఆరెంజ్ కలర్ చీర ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు షాద్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): దేవాలయం లాంటి పాఠశాలలో ఆకతాయిలు వికృత చేష్టలకు పాల్పడ్డారు. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రాత్రి కొందరు ఆకతాయిలు పాఠశాలలోకి వెళ్లి వికృత చేష్టలు చేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేయడమే కాకుండా కుర్చీలు, బల్లలు విరగ్గొట్టారు. బీరువాలు తెరిచి రిజిష్టర్లు, కాగితాలు చెల్లాచెదురుగా పారవేశారు. గ్రామస్తులు దుండగలపై చర్యలు తీసుకోవాలని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు ఖమ్మంలో జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ కోరారు. శనివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. గురుకుల హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా లక్ష్మణ్, కార్యదర్శిగా శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.

గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణను ఎత్తివేయాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా తాల్లరాంపూర్‌లో గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణను వెంటనే ఎత్తివేయాలని, గ్రామ అభివృద్ధి కమిటీలను రద్దుచేయాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గోరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నం చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద వృత్తి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. తాల్లరాంపూర్‌లో గీత కార్మికుల ఉపాధిని దెబ్బతీసే విధంగా తాటిచెట్లను కూల్చడమే గాకుండా వారిని సాంఘిక బహిష్కరణ చేయడమనేది దుర్మార్గమన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ సామ్యేల్, వృత్తిసంఘాల నాయకులు విఘ్నేష్, మల్లేష్, సుమలత తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం నాయకుడు ఆవుల వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జాతీయ దివ్యాంగుల సంఘం నాయకులు ఎం.శ్రీనివాసులుతో కలిసి సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి అమలయ్యేలా చూడాలని కోరగా నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వెంకటేశ్ ఈ సందర్భంగా తెలిపారు.

రజతోత్సవ సభకు దండులా కదలాలి


సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గులాబీ జెండా, కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని, ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు దండులా కదలాలని బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ అన్నారు. అబద్దాల పునాదుల మీద నిర్మితమైన రేవంత్‌రెడ్డి సర్కార్ హామీల అమలులో విఫలమై అన్నివర్గాల ప్రజల ఛీత్కారానికి గురువుతుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం శనివారం పత్యానాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రజతోత్సవ సభ విజయవంతపై చర్చించారు. బహిరంగ సభకు సంబంధించి రూపొందించిన వాల్ పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి పత్యానాయక్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పత్యానాయక్ మాట్లాడుతూ రజతోత్సవ బహిరంగ సభకు ఇంటికో జెండా, ఊరికో బండితో పార్టీ శ్రేణులు దండులా కదలాలని పిలుపు నిచ్చారు. నిరంజన్‌గౌడ్, ఎంగలి రఘు, కమటం వెంకటయ్య, బాలస్వామి, వస్పుల సాయిలు, దేరంగుల వెంకటేశ్, శివకుమార్, సైదులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


వీరన్నపేట్‌లో కేంద్ర పథకాలను వివరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

చౌదరిగూడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట్‌లో శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీచలో కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే గ్రామంలోని గంగమ్మ దేవాలయాన్ని శుభ్రపరిచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. మచ్చ సుధాకర్‌రావు, రంగన్న గౌడ్, బాల్‌రెడ్డి, ప్రభు, గొల్ల రాజు, రాము, రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

కేశంపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన జీవిత చరిత్ర చదవాలని షాద్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్ సూచించారు. నిర్దవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో శనివారం వివేకానంద స్వామి జీవిత సందేశం పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి విజయ్, ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆమనగల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం అంతారంలో శనివారం పర్యటించారు. గ్రామస్థులు బ్యాండ్ వాయిద్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శివరామాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. సుంకిరెడ్డిని గ్రామస్థులు సత్కరించారు. చుక్కాపూర్‌లో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ వార్డు సభ్యుడు ఎండీ. షైమద్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఫౌండేషన్ ద్వారా రూ.25వేల ఆర్థిక సాయం అంద జేశారు. రాములు, కిషోర్, మహేశ్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : అంబేడ్కర్, రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అఘోరి(అల్లూరి శ్రీనివాస్) పై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్ కోరారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ సీఐ జానకిరామ్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

కడ్తాల్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను బీజేపీ శ్రేణులు ఎప్పటికప్పుడు ఎండగట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు మహేశ్ పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్, సోనియా గాంధీలపై ప్రభుత్వం చార్జిషీట్ వేస్తే మోదీ, అమిత్‌షాలను తప్పుపడుతూ దిష్టిబొమ్మలు దహనం చేయడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్‌కు వ్యతిరేక నినాదాలు చేసి ర్యాలీలు నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు.

యాచారం : పాల ఉత్పత్తి పెంచితే ఆర్థిక ఇబ్బందులు తీరుతాయని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ హైదరాబాద్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ పాడి రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో యాచారం, మంచాల, మాడ్గుల మండలాలకు చెందిన పాడి రైతులతో సమావేశమయ్యారు. పాటించాల్సిన యాజమాన్య పద్దతులు తెలిపారు.

మొయినాబాద్ రూరల్ : మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ హిమాయత్ నగర్ వార్డు కార్యాలయంలో ఆయన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో మొత్తం 542 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

షాబాద్ : చందనవెల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు స్వామి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. రోటరీక్లబ్ తరఫున 46మందికి సర్టిఫికెట్లు అందించారు.

కేశంపేట : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగే విధంగా ఇందిరమ్మ కమిటీలు చొరవ తీసుకోవాలని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. అల్వాల రైతు వేదికలో ఇందిరమ్మ కమిటీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మొయినాబాద్ రూరల్ : హిమాయత్ నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డగట్ల నాగరాజు ఇంజనీరింగ్ విభాగంలో 'ట్రాన్స్‌ఫార్మర్ లెస్ సింగిల్ ఫేస్ మల్టీలెవల్ ఇన్వెర్టర్ ఫర్ సోలార్ ఫోటోవోల్టాయిక్ సిస్టమ్స్ విత్ వోల్టేజ్ బూస్టింగ్ ప్రాపర్టీపై పరిశోధన చేయగా డాక్టరేట్ చేశారు. ఈమేరకు ఆయనకు డాక్టరేట్ అందుకున్నారు. ఈమేరకు శనివారం చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి ఆయనకు డాక్టరేట్ అందజేశారు.

పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి


డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

యాచారం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితా నుంచి పట్టాభూములను తొలగించి రైతులను ఆదుకోవాలని, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులను సైతం ఆదుకునేందుకు చొరవ తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహాలు కోరారు. ఈమేరకు ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో శనివారం మహేశ్వరం డీసీపీ సునితారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. 591 ఎకరాల భూమిని 99 మంది రైతులు బినామీ పేర్లతో రూ.30కోట్లు కాజేశారని.. విచారణ చేసి పట్టాదారులకు పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. బోగస్ పేర్లతో ప్రజాధనాన్ని కాజేసిన వారిపై విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదుచేయాలని కోరారు. నిషేధిత జాబితాలో ఉన్న 2800 ఎకరాల భూములను తక్షణమే రైతుల పేరిట నమోదు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మాసిటీ కోసం భూమి ఇచ్చిన రైతులకు ఇంటి స్థలంతో పాటు రూ.15లక్షల పరిహారం అందించాలని కోరారు. రైతులకు నోటీస్ ఇవ్వకుండా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం సర్వే చేయడం మంచిదికాదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారంగా రైతులను ఆదుకోవాలని, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.రాంచందర్, పి.అంజయ్య తదితరులున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే అశోక్‌రెడ్డి మృతి

- భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు విద్యాసాగర్


బాధిత కుటుంబంతో విద్యాసాగర్, సభ్యులు

చౌదరిగూడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే అశోక్‌రెడ్డి మృతిచెందాడని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని చిన్నఎల్కిచర్లలో ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన అశోక్‌రెడ్డి కుటుంబాన్ని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులతో కలసి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలి దుమారానికి విద్యుత్ వైర్లు తెగిపడి నాలుగు రోజులైందని.. నీరు తాగడానికి ఇబ్బంది ఉందని సమాచారం ఇచ్చినా విద్యుత్ అధికారులు మరమ్మతులు చేయలేదన్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని.. లేనియెడల కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని సభ్యులు హెచ్చరించారు. సత్యనారాయణరెడ్డి, నర్సింహులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.